
సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

గురువారం। 3। ఆగస్టు। 2023



చీనీ టన్ను రూ.17 వేలు
అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.17 వేలు పలికాయి.



నిండుకుండలా టీబీ డ్యాం
తుంగభద్ర జలాశయానికి బుధవారం 29,763 క్యూసెక్కుల వరద నీరు చేరింది. ప్రస్తుతం డ్యాంలో 81.540 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

గరిష్టం/కనిష్టం
36.8°/21.2°
జిల్లాలో బుధవారం పగటి ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగాయి. రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా కొనసాగాయి. గాలివేగం పెరిగింది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి జల్లులు పడ్డాయి.

తల్లీబిడ్డల ఆరోగ్యానికి అండ

- టేక్ హోం రేషన్ పంపిణీ ప్రారంభించిన జేసీ చేతన్
- జిల్లాలోని 24,794 మంది గర్భిణులు, బాలింతలకు లబ్ధి



ఓ గర్భిణికి వైఎస్సార్ సంపూర్ణ పోషణకిట్ అందజేస్తున్న జాయింట్ కలెక్టర్ చేతన్

పుట్టపర్తి అర్బన్: తల్లీబిడ్డల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని జాయింట్ కలెక్టర్ చేతన్ తెలిపారు. బుధవారం ఆయన పుట్టపర్తిలోని ఎనుములపల్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి 'వైఎస్సార్ సంపూర్ణ పోషణ' కిట్లను గర్భిణులు, బాలింతలకు అందజేశారు. ఈ సందర్భంగా జేసీ చేతన్ మాట్లాడుతూ... ఇప్పటి వరకూ గర్భిణులు, బాలింతలు అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చి భోజనాలు చేసే వారన్నారు. కానీ దీనివల్ల పలు ఇబ్బందులు పడుతున్నట్లు ఒక సర్వేలో తేలిందన్నారు. దీంతో గర్భిణులు, బాలింతల సౌకర్యార్థం ఇంటికే రేషన్ అందించే కార్యక్రమానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారన్నారు. ఈ క్రమంలో జిల్లాలో 2,824 అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా 12,646 మంది గర్భిణులు, 12,148 మంది బాలింతలకు నెలకు సరిపడా సరుకులను, పౌష్టికాహారాన్ని ఒకేసారి అందజేస్తారన్నారు. ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పది వస్తువులతో సంపూర్ణ పోషణ

వైఎస్సార్ పోషణ కిట్‌లో పది రకాల వస్తువులు ఉంటాయని, వీటి ద్వారా గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం లభిస్తుందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే సంపూర్ణ పోషణ కిట్లలో 3 కిలోల ఫోర్టిఫైడ్ బియ్యం, కేజీ కందిపప్పు, అర లీటరు నూనె, వేరుశనగ చిక్కీలు, రాగిపిండి, అటుకులు, 25 కోడి గుడ్లు, 5 లీటర్ల పాలు, ఖర్జూరాలు, బెల్లం తదితర పది వస్తువులు ఉంటాయన్నారు. వీటిని క్రమం తప్పకుండా తీసుకుంటూ గర్భిణులు, బాలింతలకు రక్తహీనత సమస్యను అధిగమించాలన్నారు. పోషకాహారంతో పాటు 104 ద్వారా వైద్య సేవలు, ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పౌష్టికాహారం సక్రమంగా పంపిణీ చేయక పోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ లక్ష్మీకుమారి, ఎంపీపీ ఏవీ రమణారెడ్డి, డీఎస్‌ఓ వంశీకృష్ణారెడ్డి, తహసీల్దార్ నవీన్‌కుమార్, ఎంపీడీఓ అశోక్‌కుమార్‌రెడ్డి, సీడీపీఓ గాయత్రి, సూపర్‌వైజర్ భారతి, కౌన్సిలర్ కేశవయ్య, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మంచి ఆలోచన



గర్భిణులు, బాలింతల సౌకర్యార్థం ఇంటికే రేషన్ పంపిణీ చేయడం మంచి ఆలోచన. రోజూ అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లి భోజనం చేయడం కాస్త ఇబ్బందిగా ఉండేది. మా ఇబ్బందులు గుర్తించిన ప్రభుత్వం వైఎస్సార్ పోషణ కిట్లు అందజేయడం ఆనందంగా ఉంది. ఈ కార్యక్రమం వల్ల గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలకు ఎంతో మేలు జరుగుతుంది. **– సిమ్రాన్, గర్భిణి, పుట్టపర్తి**

జగనన్నకు రుణపడి ఉంటాం



చంటి పిల్లలను ఇంటి వద్ద వదిలి కేంద్రాలకు వచ్చి భోజనం తిని వెళ్లేందుకు చాలా ఇబ్బందులు ఉండేవి. దీంతో చాలా మంది పౌష్టికాహారం తినలేకపోయేవారు. ఇకపై అలాంటి సమస్య లేకుండా సంపూర్ణ పోషణ కిట్లు అందిస్తున్నారు. మహిళల ఆరోగ్యం గురించి ఇంతలా ఆలోచిస్తూ నిర్ణయం తీసుకున్న జగనన్నకు రుణపడి ఉంటాం. **– నిర్మల, బాలింత, ఎనుములపల్లి**

పది రకాల సరుకులిచ్చారు



సంపూర్ణ పోషణ కిట్ ద్వారా నాకు పది రకాల సరుకులు ఇచ్చారు. అందులో ఫోర్టిఫైడ్ బియ్యంతో పాటు రాగి పిండి, అటుకులు, చిక్కీలు, బెల్లం, కోడి గుడ్లు, పాలు తదితర సరుకులు ఉన్నాయి. ఇంత నాణ్యమైనవి అంగట్లో సైతం దొరకవు. మా ఆరోగ్యం కోసం ఇంతలా కృషి చేస్తున్న సీఎం జగన్ మోహన్‌రెడ్డి రుణం తీర్చుకోలేం. **– గీతాంజలి, గర్భిణి, పుట్టపర్తి**

న్యూస్‌రీల్

'పుడా' వైస్ చైర్మన్‌గా బండి శేషన్న



ప్రశాంతి నిలయం: పుట్టపర్తి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వైస్ చైర్మన్‌గా ధర్మవరం మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న (ఎఫ్ఏసీ)ను నియమిస్తూ మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీలక్ష్మి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఇక్కడ పనిచేసిన నరేష్ కృష్ణ సెలవులో వెళ్లారు. ఇటీవలే ఆయన్ను చిలమత్తూరు ఎంపీడీఓగా బదిలీ చేశారు. ఈ నేపథ్యంలో పుట్టపర్తి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వైస్ చైర్మన్ స్థానం ఖాళీ కాగా, బండి శేషన్నను నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు.

93 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి



ఇరగరాజుపల్లి గ్రామంలో పింఛన్ అందజేస్తున్న వలంటీర్ జ్యోతి

పుట్టపర్తి అర్బన్: 'వైఎస్సార్ పింఛన్ కానుక' పంపిణీ జిల్లాలో జోరుగా సాగుతోంది. రెండో రోజు బుధవారం నాటికి జిల్లాలోని 2,61,340 మంది లబ్ధిదారులకు గాను 2,43,610 మందికి రూ.67,60,79,500 మొత్తాన్ని పంపిణీ చేశారు. తొలిరోజు ఇంటింటికీ తిరిగి పింఛన్ పంపిణీ చేసిన వలంటీర్లు రెండురోజు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న, సుదూర ప్రాంతాల్లో ఉంటున్న వారి వద్దకే వెళ్లి పింఛన్ మొత్తం అందించారు. పింఛన్ పంపిణీకి మరో మూడు రోజులు గడువు ఉందని, తప్పకుండా 100 శాతం పంపిణీ చేస్తామని డీఆర్‌డీఏ పీడీ నరసయ్య తెలిపారు.

ఈఆర్ఓల నియామకం

పుట్టపర్తి అర్బన్: 2024లో జరగనున్న సార్వత్రిక ఎన్నికల కోసం ఎన్నికల రిటర్నింగ్ అధికారులను నియమించారు. జిల్లాకు సంబంధించి అన్ని నియోజక వర్గాలకు ఈఆర్ఓలను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ అరుణ్‌బాబు పేర్కొన్నారు. పుట్టపర్తికి ఆర్డీఓ భాగ్యరేఖ, కదిరికి ఆర్డీఓ రాఘవేంద్ర, ధర్మవరం-ఆర్డీఓ తిప్పేనాయక్, హిందూపురం-జాయింట్ కలెక్టర్ చేతన్, పెనుకొండ-సబ్ కలెక్టర్ కార్తీక్, మడకశిర- అహుడా సెక్రటరీ చిన్నయ్యను నియమించినట్లు తెలిపారు.

టమాట రికార్డుల మోత



అనంతపురం అగ్రికల్చర్: టమాట ధర రికార్డుల మోత మోగిస్తోంది. ఈ సీజన్‌లో కిలో గరిష్ట ధర రూ.150తో ఇప్పటికే రికార్డు సృష్టించిన టమాట బుధవారం ఆల్‌టైం గరిష్ట సూచీని తాకింది. అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో కిలో టమాట గరిష్ట ధర రూ.160 పలికినట్లు రాప్తాడు మార్కెట్ కమిటీ సెక్రటరీ రామ్‌ప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు 240 టన్నుల సరుకు అమ్మకానికి రాగా, వేలంలో కిలో గరిష్టంగా రూ.160, కనిష్టంగా రూ.106, సరాసరిన రూ.132 చొప్పున క్రయవిక్రయాలు జరిగాయని చెప్పారు. నాణ్యమైన టమాట 15 కిలోల బాక్సు రూ.2 వేల నుంచి రూ.2,400 వరకు అమ్ముడుపోతోంది.

రోజూ 'స్పందన' నిర్వహించాలి

- సచివాలయాల ఉద్యోగులకు జేసీ చేతన్ ఆదేశం



మూమెంట్ రిజిష్టర్‌ను పరిశీలిస్తున్న జేసీ చేతన్

పుట్టపర్తి అర్బన్: సచివాలయాల్లో రోజూ మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ 'స్పందన' కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించాలని జాయింట్ కలెక్టర్ చేతన్ ఆదేశించారు. బుధవారం ఆయన ఎనుములపల్లి -2 సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆ సమయంలో సచివాలయంలో కేవలం ఇద్దరు ఉద్యోగులు మాత్రమే అందుబాటులో ఉండటంతో ఆయన మూమెంట్ రిజిష్టర్‌ను పరిశీలించారు. అందులో ఏ ఉద్యోగి ఎక్కడికి వెళ్లారో నమోదు చేయకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే హాజరు పట్టికను, స్పందన రిజిష్టర్‌ను క్షుణ్ణంగా పరిశీలించారు. సిబ్బంది రోజూ ఉదయం 10.30 గంటలకు తప్పకుండా హాజరు కావాలన్నారు. సమయ పాలన పాటించకపోతే చర్యలు తప్పవన్నారు. సంక్షేమ పథకాల క్యాలెండర్లను ప్రజలకు అందుబాటులో ప్రదర్శించాలన్నారు. ఇప్పటి వరకూ స్పందనకు ఎన్ని దరఖాస్తులు వచ్చాయి, గడువు లోపు ఎన్ని పరిష్కరించారు, వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేశారా...? అని ఆరా తీశారు. స్పందనలో 3,386 దరఖాస్తులు అందగా, అన్నీ సకాలంలో పూర్తి చేశామని సిబ్బంది సమాధానం చెప్పారు. జేసీ వెంట డీఎస్‌ఓ వంశీకృష్ణారెడ్డి, తహసీల్దార్ నవీన్‌కుమార్, ఎంపీడీఓ అశోక్‌కుమార్‌రెడ్డి, ఐసీడీఎస్ పీడీ లక్ష్మీకుమారి, ఎంపీపీ ఏవీ రమణారెడ్డి, కౌన్సిలర్ కేశవయ్య ఉన్నారు.

బాబు రాక.. అసమ్మతి కాక

- చంద్రబాబు పర్యటన నేపథ్యంలో ఏకమైన అసమ్మతి నేతలు
- టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీకే పార్థసారథి వైఖరిపై చర్చ
- అధినేతతో అమీతుమీకి సిద్ధం



తన వర్గం నాయకులతో కలిసి సవితమ్మతో చర్చిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఈరన్న

పెనుకొండ: ప్రాజెక్టుల సందర్శన పేరుతో జనంలోకి వచ్చి టీడీపీకి ఊపు తెద్దామనుకుంటున్న చంద్రబాబు ప్రయత్నం బెడిసి కొడుతోంది. చంద్రబాబు పర్యటన ఆ పార్టీకి ఏం ప్రయోజనం చేకూరుస్తుందో తెలియదు గానీ అసమ్మతి నేతలందరినీ మాత్రం ఏకతాటిపైకి తీసుకువస్తోంది. చంద్రబాబు గురువారం మండలంలోని గొల్లపల్లి రిజర్వాయర్‌కు రానున్న నేపథ్యంలో బుధవారం పెనుకొండ పట్టణంలో మాజీ ఎమ్మెల్యే బీకే పార్థసారథికి వ్యతిరేకంగా టీడీపీ అసమ్మతి నాయకులు సమావేశమయ్యారు. ఇందుకు సవితమ్మ కార్యాలయం వేదికైంది. మడకశిర నియోజకవర్గానికి చెందిన మాజీ ఎమ్మెల్యే ఈరన్న పెనుకొండకు వచ్చి సవితమ్మ కార్యాలయంలో సుదీర్ఘ చర్చలు జరిపారు. వీరితో పాటు పలువురు సీనియర్ నాయకులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీకే పార్థసారథి ఒంటెత్తుపోకడను అధినేతకు తెలిపి ఆయన్ను ఆ పదవి నుంచి తప్పించేలా ఒప్పించాలని వారు చర్చించినట్లు తెలుస్తోంది.

ఆ ఇద్దరే ఎందుకంటే..

బీకే పార్థసారథి టీడీపీ జిల్లా అధ్యక్షుడిగా ఉన్నప్పటికీ ఆ పార్టీ నేతలు ఎవరూ ఆయన్ను పట్టించుకునే పరిస్థితి లేదు. పైగా ఒకరిద్దరు ఆయనకు గౌరవమిచ్చినా వారిపై తన ప్రతాపం చూపుతారు. ఈక్రమంలోనే పెనుకొండలో తనకు పోటీగా భావించి సవితమ్మను పార్టీలో ఎదగకుండా ఎక్కడికక్కడ చెక్ పెట్టారు. అలాగే మడకశిరలో తిప్పేస్వామికి వ్యతిరేకంగా ఉన్న ఈరన్నను బీకే అన్ని కార్యక్రమాలకు దూరం పెట్టాడు. ఇటీవల టీడీపీ బస్సుయాత్ర సందర్భంగా పెనుకొండలో బీకే, సవితమ్మకు వర్గీయులు బజారులో కొట్టుకున్నారు. పోలీసులు సకాలంలో స్పందించకపోతే పరిస్థితి చేజారేది. ఇక మడకశిరలో ఈరన్న వర్గం తిరుగుబాటు చేసే ప్రమాదం ఉందని భావించిన బీకే, టీడీపీ జిల్లా నాయకులు రథయాత్ర రూట్ మ్యాప్‌లో మడకశిరను తీసివేశారు. దీంతో ప్రస్తుతం ఈ ఇద్దరు నేతలు తమ నిరసన గళం పార్టీ అధినేత ఎదుటే వినిపించేందుకు సిద్ధమయ్యారు. బీకే పార్థసారథి తమను ఉద్దేశపూర్వకంగా పార్టీ కార్యక్రమాలకు దూరం పెడుతున్నారని, పార్టీ కార్యక్రమాలు కూడా తమకు చెప్పడం లేదన్న విషయాలను చంద్రబాబుకు వివరించే అవకాశం ఉన్నట్లు పార్టీ నాయకుల ద్వారా తెలిసింది. ఎస్సీ నియోజకవర్గమైన మడకశిరలో ఎస్సీ వర్గాల నేతలను అవమానపరుస్తూ బీసీలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని, మాజీ ఎమ్మెల్యేనన్న కనీస మర్యాద ఇవ్వడం లేదని ఈరన్న తీవ్ర ఆవేదనతో ఉన్నారు. అందువల్లే పార్టీ కొన్ని వర్గాలకు దూరమైందని, ప్రధానంగా జిల్లాలో టీడీపీ పరిస్థితి బాగోలేదని, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు ఇతర వర్గాలు దూరమయ్యారని, ఇందుకు నాయకత్వ లోపమే కారణమన్న విషయాలను చంద్రబాబుకు వివరించే అవకాశం ఉన్నట్లు ఆయా వర్గాల నేతలు చెబుతున్నారు. వీరిద్దరికి తోడు మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప కూడా అధినేతతో అమీతుమీకి సిద్ధమైనట్లు తెలుస్తోంది.

వైఎస్సార్ చొరవతోనే 'గొల్లపల్లి'



మాట్లాడుతున్న శంకరనారాయణ

పెనుకొండ రూరల్: దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి చొరవతోనే గొల్లపల్లి రిజర్వాయర్ రూపుదిద్దుకుందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, పెనుకొండ ఎమ్మెల్యే శంకరనారాయణ అన్నారు. బుధవారం ఆయన గొల్లపల్లిలో ఎమ్మెల్సీ మంగమ్మ, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మతో కలిసి విలేకరులతో మాట్లాడారు. జిల్లా రైతాంగం సాగునీటికోసం పడుతున్న ఇబ్బందులను గుర్తించిన వైఎస్ రాజశేఖరరెడ్డి సాగు, తాగునీటి ఇబ్బందులు తీర్చేందుకు గొల్లపల్లి వద్ద రిజర్వాయర్ నిర్మించి హంద్రీ-నీవా ద్వారా కృష్ణా జలాలు తెచ్చేందుకు కృషి చేశారన్నారు. ఇందుకోసం రూ. 6 వేల కోట్లతో పనులు చేపట్టారన్నారు. అందులో భాగంగానే జీడిపల్లి, గొల్లపల్లి, చెర్లోపల్లి, మారాలా, తదితర ప్రాజెక్ట్‌లకు రూ.5,900 కోట్లు ఖర్చు చేశారన్నారు. కానీ అంతకుముందు తొమ్మిది సంవత్సరాలు అధికారంలో ఉన్న చంద్రబాబు కేవలం రూ.9 కోట్లు ఖర్చు చేశారన్నారు. చివరకు సాగునీటి పథకంగా ఉన్న ప్రాజెక్టును తాగునీరు పథకంగా మార్చిన ఘనత చంద్రబాబునేనన్నారు. కానీ దూరదృష్టి కలిగిన వైఎస్ రాజశేఖరరెడ్డి గొల్లపల్లి రిజర్వాయర్ పనులు దాదాపు పూర్తి చేశారన్నారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన చంద్రబాబు కేవలం తుది మెరుగులు దిద్ది గొప్పలు చెప్పారన్నారు. ఇప్పుడు ప్రాజెక్టుల సందర్శన పేరుతో తాను నిర్మించని వాటి వద్దకు రావడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రాష్ట్రంలో టీడీపీ ఉనికి ప్రశ్నార్థకమైందని, చంద్రబాబు ఎన్ని గిమ్మిక్కులు చేసినా జనం ఇక నమ్మే పరిస్థితి లేదన్నారు.

రైతు ద్రోహి చంద్రబాబు

- నాడు ప్రాజెక్టులపై పూర్తి నిర్లక్ష్యం
- ఎన్నికలొచ్చేసరికి ఎక్కడా లేని ప్రేమ
- ప్రజలను మభ్య పెట్టేందుకు 'ప్రాజెక్టుల సందర్శన'
- టీడీపీ అధినేతపై రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ధ్వజం



ఆత్మకూరు వద్ద బాబు హయాంలో తవ్వి వదిలేసిన కాలువను చూపుతున్న ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి

ఆత్మకూరు: అధికారంలో ఉన్నప్పుడు సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేయకుండా నారా చంద్రబాబు నాయుడు రైతు ద్రోహిగా మిగిలిపోయారని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ధ్వజమెత్తారు. హంద్రీ-నీవా పథకానికి సంబంధించి ఆత్మకూరు వద్ద 1998లో చంద్రబాబు శిలాఫలకం వేసి, కేవలం 50 మీటర్ల వరకు కాలువ తవ్వి వదిలేసిన ప్రదేశాన్ని బుధవారం రైతులతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ హంద్రీ-నీవా పథకానికి 1996లో ఉరవకొండ వద్ద ఒకసారి, 1998లో ఆత్మకూరు వద్ద మరొకసారి, 2017లో ఉరవకొండ వద్ద ఇంకోసారి, 2019 ఎన్నికలకు ముందు పేరూరు డ్యాంకు నీళ్లిస్తామని ఒకసారి చంద్రబాబు శిలాఫలకాలు వేశారన్నారు.

వ్యవసాయాన్ని పండుగ చేసిన వైఎస్సార్

దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి వ్యవసాయాన్ని పండుగలా మార్చారని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అన్నారు. జలయజ్ఞం ద్వారా ప్రాజెక్టులు పూర్తి చేసి ఆయకట్టుకు సాగునీరిచ్చి ఆయా ప్రాంతాలను సస్యశ్యామలం చేశారన్నారు. నాడు వైఎస్సార్ రైతులకు ఉచిత విద్యుత్ ఇస్తామంటే తీగల మీద బట్టలు ఆరేసుకుంటారా.. వ్యవసాయం దండగ అని చంద్రబాబు హేళన చేశారని గుర్తు చేశారు. ఇప్పుడు ఎన్నికలు వస్తుండటంతో రైతులపై కపట ప్రేమ చూపిస్తూ ప్రాజెక్టుల పరిశీలనకు వస్తున్నారని మండిపడ్డారు. 2014లో హంద్రీ-నీవా పెండింగ్ పనులను చంద్రబాబు కొనసాగించారు తప్ప చేసిందేమీ లేదన్నారు. అప్పటికే శ్రీశైలం నుంచి జీడిపల్లి రిజర్వాయర్‌కు నీళ్లు వచ్చాయని తెలిపారు. ఫేజ్-2లో భాగంగా జీడిపల్లి రిజర్వాయర్ నుంచి మడకశిర బ్రాంచ్ కెనాల్ వరకు దాదాపు 60 శాతానికి పైగా పనులు పూర్తయ్యాయని పేర్కొన్నారు. మడకశిర బ్రాంచ్ కెనాల్ కానీ, పుంగనూరు బ్రాంచ్ కెనాల్‌ను కానీ చంద్రబాబు పూర్తి చేయలేదని స్పష్టం చేశారు. పైగా తమకు అనుకూలంగా ఉన్న వారికి కాంట్రాక్టులు ఇచ్చుకుంటూ రూ.10 కోట్ల పనులను రూ.వంద కోట్లకు పెంచి నిధులు దోపిడీ చేశారని ప్రకాష్‌రెడ్డి విమర్శించారు. జగనన్న ముఖ్యమంత్రి అయ్యాక చెరువులకు నీరిచ్చారన్నారు. అలాగే మడకశిర బ్రాంచ్ కెనాల్ నుంచి రొద్దం మండలం పెన్నా నదికి నీళ్లు వదిలి అక్కడి నుంచి పేరూరు డ్యాంకు రూపాయి ఖర్చు లేకుండా నీళ్లు ఇచ్చామన్నారు.

నారా వారు అడుగు పెడితే నాశనమే

'వైఎస్సార్‌సీపీ నాలుగేళ్ల పాలనలో రాష్ట్ర వ్యాప్తంగా సమృద్ధిగా వర్షాలు కురిశాయి. ప్రస్తుత ఖరీఫ్‌లో విత్తనాలు సాగు చేసే ముందు లోకేష్ యువగళం పేరిట రాయలసీమలో పాదయాత్ర చేశాడు. ఆ యాత్ర సాగినన్ని రోజులు చుక్క కూడా వర్షం పడలేదు. యాత్ర రాయలసీమ దాటాక వర్షం కురిసింది. విత్తనాలు విత్తుకున్న రైతులకు ఇప్పుడు చంద్రబాబు వస్తున్నాడంటే మళ్లీ భయం పుట్టుకుంది. చంద్రబాబు వస్తే వర్షాలు రావని, నారా కుటుంబం అడుగు పెడితే నాశనమే' అని ప్రకాష్‌రెడ్డి విమర్శించారు. ఎన్నికల సమయంలో ప్రజలను మభ్య పెట్టేందుకే చంద్రబాబు ప్రాజెక్టుల పరిశీలన పేరుతో డ్రామాలు ఆడుతున్నారని మండిపడ్డారు.

పుష్పలతా చనిపోయింది!

- ఊజీ మాత్రలు మింగిన ఘటనలో కూతురూ మృతి
- ఇందుకూరులో విషాదం
- వారంరోజుల్లోనే ముగ్గురు మృత్యువాత




పుష్పలత(ఫైల్)

ముదిగుబ్బ: మండలంలోని ఇందుకూరులో విషాదం చోటుచేసుకుంది. కుమారుడి మరణాన్ని జీర్ణించుకోలేక కూతురితో కలిసి తల్లి ఊజీ మాత్రలు మింగిన ఘటనలో మంగళవారమే తల్లి మృత్యువాత పడగా, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కూతురూ బుధవారం మృతి చెందింది. వివరాల్లోకి వెళితే...ఇందుకూరుకు చెందిన ప్రతాప్‌రెడ్డి వారం రోజుల క్రితం అనుమానాస్పద స్థితిలో మృతి చెందగా, కుమారుడి మరణాన్ని జీర్ణించుకోలేని అతని తల్లి వెంకటలక్ష్మమ్మ కూతురు పుష్పలత(23)తో కలిసి మంగళవారం ఊజీ మాత్రలు మింగింది. ఇరుగూపొరుగు గమనించి తల్లీకూతుళ్లను అనంతపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా, మంగళవారమే వెంకటలక్ష్మమ్మ మృతి చెందింది. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పుష్పలత కూడా కోలుకోలేక బుధవారం మరణించింది. వారం రోజుల్లోనే ఒకే ఇంట్లో మూడు ప్రాణాలు పోవడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

మంచికోసం మార్పు!

- పోలీసు సబ్‌డివిజన్ల విభజనకు రంగం సిద్ధం
- మడకశిర కేంద్రంగా కొత్త సబ్‌డివిజన్ ఏర్పాటుకు చర్యలు
- పరిధి ఎక్కువగా ఉన్న సర్కిళ్లనూ విభజించేందుకు ప్రణాళిక
- ప్రతిపాదనలు పరిశీలిస్తున్న పోలీసు ఉన్నతాధికారులు



సాక్షి, పుట్టపర్తి: శాంతిభద్రతల పరిరక్షణ, వేగవంతమైన సేవలందించేందుకు పోలీస్ శాఖలో మార్పులు జరుగుతున్నాయి. ఇప్పటికే సిబ్బంది ఖాళీలను భర్తీ చేసిన ప్రభుత్వం ఇతర అంశాలనూ పరిశీలిస్తోంది. ఈ క్రమంలో పరిధి ఎక్కువగా ఉన్న పోలీసు సబ్ డివిజన్లు, సర్కిళ్లను కుదించి కొత్త వాటిని ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది. శ్రీసత్యసాయి జిల్లా ఆవిర్భావం తర్వాత పెనుకొండ సబ్ డివిజన్‌లో ఉన్న హిందూపురాన్ని కొత్తగా సబ్ డివిజన్‌గా మార్చి నూతన డీఎస్పీని నియమించారు. అదేవిధంగా పుట్టపర్తి సబ్ డివిజన్ పునఃప్రారంభమైంది. దీనికి తోడు ధర్మవరం టూ టౌన్‌తో పాటు ముదిగుబ్బ సర్కిల్ ఏర్పాటైంది. జిల్లాలో ప్రస్తుతం ఐదు (పుట్టపర్తి, కదిరి, ధర్మవరం, పెనుకొండ, హిందూపురం) పోలీస్ సబ్‌డివిజన్లు ఉన్నాయి. ఈ నేపథ్యంలో విభజన సమీకరణాల్లో భాగంగా త్వరలో మరో సబ్ డివిజన్ ఏర్పాటు కానున్నట్లు తెలుస్తోంది.

నియోకవర్గానికి ఒక సబ్ డివిజన్

జిల్లాలో ఆరు (పుట్టపర్తి, కదిరి, ధర్మవరం, పెనుకొండ, హిందూపురం, మడకశిర) అసెంబ్లీ నియోజకవర్గాలతో పాటు రాప్తాడు నియోజకవర్గంలోని మూడు (రామగిరి, కనగానపల్లి, చెన్నేకొత్తపల్లి) మండలాలు ఉన్నాయి. ప్రస్తుతం అసెంబ్లీ నియోజకవర్గానికో సబ్ డివిజన్ ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన ప్రభుత్వం వద్దకు వెళ్లినట్లు తెలుస్తోంది. ఇప్పటికే పుట్టపర్తి, కదిరి, హిందూపురం, ధర్మవరం, పెనుకొండ సబ్ డివిజన్లు ఉన్నాయి. రాప్తాడు నియోజకవర్గంలోని మూడు మండలాలు ధర్మవరం సబ్ డివిజన్‌లో ఉన్నాయి. పెనుకొండ సబ్ డివిజన్‌లో మడకశిర నియోజకవర్గం ఉంది. దీంతో నూతన సబ్‌డివిజన్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది.

విభజన తప్పనిసరి

జిల్లాలోని ఐదు పోలీస్ సబ్ డివిజన్లలో అతి పెద్దది పెనుకొండ. ఇందులో మూడు (గోరంట్ల, పెనుకొండ, మడకశిర) సర్కిళ్లలో 11 పోలీస్ స్టేషన్లు ఉన్నాయి. గోరంట్ల సర్కిల్ మండలానికే పరిమితం కాగా, పెనుకొండ సర్కిల్‌లో ఐదు (పెనుకొండ, కియా, సోమందేపల్లి, రొద్దం, పరిగి) స్టేషన్లు ఉన్నాయి. మడకశిర సర్కిల్‌లో ఐదు (మడకశిర, అగళి, రొళ్ల, గుడిబండ, అమరాపురం) స్టేషన్లు ఉన్నాయి. పరిధి ఎక్కువగా ఉన్న క్రమంలో మడకశిర రూరల్ సర్కిల్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిసింది. ఈ మేరకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు సమాచారం. మడకశిర నియోజకవర్గం పరిధిలోని స్టేషన్లతో కొత్తగా మడకశిర సబ్ డివిజన్ ఏర్పాటుపై కూడా ప్రభుత్వం దృష్టి సారించినట్లు సమాచారం.

మెరుగైన సేవలు...సిబ్బందిపై పర్యవేక్షణ

ప్రజలకు మెరుగైన, సత్వర సేవలందించడంతో పాటు సర్కిళ్లపై నిరంతర పర్యవేక్షణకే సబ్‌డివిజన్లు మార్పు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇక పరిధి ఎక్కువగా ఉన్న సర్కిళ్లలో అన్ని స్టేషన్లకు వెళ్లడం సీఐలకు కష్టంగా మారింది. దీంతో సబ్ ఇన్‌స్పెక్టర్ల హవా కొనసాగుతోంది. ఈ క్రమంలో కొందరు ఎస్ఐలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందుతున్నాయి. దీంతో వీటన్నింటికీ చెక్ పెట్టి శాంతిభద్రతల పరిరక్షణకు పెద్దపీట వేసేందుకు ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఈమేరకు జిల్లా పోలీసు ఉన్నతాధికారుల నుంచి ప్రతిపాదనలు కూడా వెళ్లినట్లు సమాచారం.

కొన్ని స్టేషన్ల అప్ గ్రేడ్

పరిధి విస్తీర్ణం, జనాభా దృష్ట్యా జిల్లాలో కొన్ని స్టేషన్లను అప్ గ్రేడ్ చేయాలని పోలీసు శాఖ ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు తెలిసింది. ఇందులో కొత్తచెరువు, మడకశిర, పెనుకొండ పోలీస్ స్టేషన్లు ఉన్నాయని సమాచారం. అంతేకాకుండా ఎస్ఐలు ఎస్‌హెచ్‌ఓలుగా ఉన్న కొన్ని పోలీస్ స్టేషన్ల బాధ్యతలను ఇక నుంచి ఇన్‌స్పెక్టర్లకు అప్పగిస్తారని తెలుస్తోంది. ఒకే సర్కిల్‌లో ఎక్కువ స్టేషన్లు ఉంటే.. కొన్ని స్టేషన్లను అప్‌గ్రేడ్ చేసి పదోన్నతి కల్పించి ఇన్‌స్పెక్టర్లకు బాధ్యతలు ఇస్తారని పోలీసు వర్గాల ద్వారా తెలిసింది.

బాబు పాలనలో కరువు దరువు

- 14 ఏళ్లలో 11సార్లు దుర్భిక్ష పరిస్థితులు
- అట్టర్‌ఫ్లాప్‌గా మారిన రెయిన్‌గన్ల షో
- పాతాళానికి భూగర్భ జలాలు
- కోలుకోలేని విధంగా పంట నష్టం



వెంకటగారిపల్లి వద్ద ఎండిన వరి మడిని చూపుతున్న రైతులు (ఫైల్)





చంద్రబాబు హయాంలో పుట్టపర్తి మండలం జగరాజుపల్లి వద్ద ఎండిన చీనీ తోట, పెడపల్లి వద్ద ఏర్పాటు చేసిన గడ్డి కేంద్రాలు (ఫైల్)

పుట్టపర్తి అర్బన్: చంద్రబాబు పాలనలో వరుణుడు ముఖం చాటేస్తాడు. ఇందుకు అప్పట్లో ప్రకటించిన కరువు మండలాలే ప్రత్యక్ష నిదర్శనం. ఏటా సగం లోటు వర్షం, రూ.వేల కోట్ల పంట నష్టం, బతుకుదెరువు కోసం లక్షలాది మంది రైతులు, కూలీలకు తప్పని వలసలు, అప్పుల నుంచి బయటపడే మార్గం కానరాక ఆత్మహత్యలకు పాల్పడడం నిత్యకృత్యంగా ఉండేవి. భూగర్భజలాలు 20 నుంచి 25 మీటర్ల మేర అత్యంత కనిష్ట స్థాయికి పతనం కావడంతో వ్యవసాయ, ఉద్యాన రైతులు కన్నీరుపెట్టారు. ఇన్‌పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్స్‌తో ఆదుకోవాల్సిన ప్రభుత్వం రైతులకు చిల్లర విదిల్చేది. అనంతపురం జిల్లాను చూసి కరువే భయపడేలా చేస్తానంటూ బీరాలు పలికిన చంద్రబాబు.. 2016లో రెయిన్‌గన్లతో హడావిడి చేసి అభాసుపాలయ్యారు. ఆయన 14 ఏళ్ల పాలనలో 1998, 2000, 2017 మినహా మిగిలిన 11 సార్లూ కరువు విలయతాండం చేసింది.

చెప్పుకునేందుకు ఒక్కటి కూడా లేదు..

సొంత మామను వెన్నుపోటు పొడిచి 1995 సెప్టెంబర్ 1న దొడ్డిదారిన సీఎం పీఠం ఎక్కిన చంద్రబాబు అప్పటి నుంచి కల్లబొల్లి కబుర్లతో 2004 మే నెల వరకు తొమ్మిదేళ్లు ఏకధాటిగా రాష్ట్రాన్ని పాలించారు. ఆ తర్వాత రైతు రుణమాఫీ, డ్వాకా రుణమాఫీ లాంటి ఆచరణకు సాధ్యం కాని హామీలు ఇచ్చి 2014 నుంచి 2019 వరకు ఐదేళ్ల సీఎంగా పని చేశారు. ఇలా 14 సంవత్సరాలు పాలించినా... చెప్పుకునేందుకు ఒక్క మంచి కార్యక్రమం కూడా లేకపోవడం గమనార్హం.

బాబును నమ్మని ప్రజలు..

చంద్రబాబు హయాంలో అభివృద్ధి వందేళ్ల వెనక్కు మళ్లింది. పచ్చమీడియాను అడ్డుపెట్టుకుని ఎదుటి పార్టీలపై కుట్ర కుతంత్రాలు పన్నడమే తప్ప నమ్ముకున్న ప్రజలకు మేలు చేస్తామనే ఆలోచన చేయకపోవడాన్ని గ్రహించిన జనం 'నిన్ను నమ్మం' బాబూ అంటున్న పరిస్థితి జిల్లాలో ఉంది. మేనిఫెస్టోలో చెప్పిన విధంగా నవరత్నాలను 99 శాతం అమలు చేస్తూ అభివృద్ధి సంక్షేమంతో దూసుకుపోతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కారును ఎలాగైనా ఇబ్బందుల్లోకి నెట్టేందుకు దుష్ప్రచారంతో ముందుకు సాగుతున్న చంద్రబాబు ధోరణిని జనం ఛీదరించుకుంటున్నారు.

ఉచిత బీమాతో రైతులకు అండగా..

చంద్రబాబు హయాంలో 2014–15 నుంచి 2018–19 మధ్య ఐదేళ్లలో పంటల బీమా కింద రూ.714 కోట్లు పరిహారం ఇచ్చినా... అందులో రైతుల నుంచి ప్రీమియం రూపంలో రూ.326 కోట్లు దండుకున్నారు. వాస్తవానికి బాబు హయాంలో రైతులకు దక్కిన పరిహారం కేవలం రూ.388 కోట్లు మాత్రమే. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ అధికారం చేపట్టినప్పటి నుంచి ఈ నాలుగేళ్లలో 11.21 లక్షల మంది రైతులకు ఏకంగా రూ.1,855 కోట్లు బీమా పరిహారం నేరుగా వారి బ్యాంక్ ఖాతాల్లోకి జమ అయింది. గతంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో మేలు జరిగినట్లు రైతులు ఇప్పటికీ గట్టిగా చెబుతారు. అంతకు మించి అన్నట్లుగా... ఇపుడు వైఎస్ జగన్ హయాంలో గ్రామ గ్రామాన ఆర్‌బీకే వ్యవస్థకు శ్రీకారం చుట్టి... వివిధ పథకాలు, కార్యక్రమాలు అమలు చేస్తుండటంతో రైతు పయనం సాఫీగా సాగుతోంది.

2014-2018 మధ్య చంద్రబాబు హయాంలో పంటల బీమా పరిహారం ఇలా...

సంవత్సరం	రైతులు కట్టిన ప్రీమియం	అందిన పరిహారం	రైతులసంఖ్య
2014-15	రూ.14.09 కోట్లు	రూ.25.61 కోట్లు	47,627
2015-16	రూ.115.06 కోట్లు	రూ.109.66 కోట్లు	1,85,194
2016-17	రూ.44.64 కోట్లు	రూ.419.10 కోట్లు	5,07,658
2017-18	రూ.72.10 కోట్లు	రూ.159.70 కోట్లు	3,10,115
2018-19	రూ.80.02 కోట్లు	--	--
ఐదేళ్లు	రూ.325.91 కోట్లు	రూ.714.07 కోట్లు	10,50,594 మంది

జగన్ పాలనలో ఒక్క పైసా ప్రీమియం కట్టించుకోకుండా రైతులకు చెల్లించిన పంటల బీమా ఇలా..

సంవత్సరం	లబ్ధిపొందిన రైతులు	పరిహారం (రూ. కోట్లలో)
2019-20	2,46,649	266.42
2020-21	2,05,291	362.25
2021-22	4,04,461	855.55
2022-23	2,65,114	370.58
నాలుగేళ్లలో	11,21,515	1,854.80

క్లుప్తంగా

గార్మెంట్స్ పరిశ్రమ నిర్మాణానికి స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న గార్మెంట్స్ కంపెనీ ప్రతినిధులు

చెన్నేకొత్తపల్లి: మండలం కేంద్రంలో ఏర్పాటు చేయనున్న గార్మెంట్ పరిశ్రమకు అనువైన స్థలం కోసం బుధవారం తమిళనాడులోని తిర్పూర్‌కు చెందిన షార్ట్ ట్రెండ్స్ ప్రైవేట్ సంస్థ ప్రతినిధులు వీరా, విఘ్నేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాప్తాడు నియోజకవర్గంలోని చెన్నేకొత్తపల్లి, రాప్తాడు, ఆలమూరు, మామిళ్లపల్లి గ్రామాల్లో తమ సంస్థ గార్మెంట్స్ పరిశ్రమలను ఏర్పాటు చేసే ప్రతిపాదనను స్థానిక ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు గుర్తు చేశారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే తన వంతు సహకారం అందిస్తూ పరిశ్రమ ఏర్పాటుకు అనువైన స్థలాలను పరిశీలించాలని సూచించారన్నారు. దీంతో తాము ఆయా మండలాల్లో పర్యటించి పరిశ్రమ ఏర్పాటుకు అనువైన స్థలం కోసం పరిశీలన చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అంజలి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రామకృష్ణారెడ్డి, నాయకులు హరినాథరెడ్డి, ఎస్టీడీ శీన, హనుమంతరెడ్డి, అనిల్‌రెడ్డి, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోండి



సంపూర్ణ పోషణ్ కిట్లను పంపిణీ చేస్తున్న దృశ్యం

పుట్టపర్తి టౌన్: తల్లీబిడ్డల సంపూర్ణ ఆరోగ్యం కోసం ప్రభుత్వం అందజేస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని గర్భిణులు, బాలింతలకు ఐసీడీఎస్ పీడీ లక్ష్మీకుమారి సూచించారు. కొత్తచెరువు మండలం నామగొండ్ల కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో వైఎస్సార్ సంపూర్ణ కిట్ల ద్వారా టేక్ హోం రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం ఆమె ప్రారంభించి, మాట్లాడారు. కార్యక్రమంలో సీడీపీఓ గాయత్రి, సూపర్‌వైజర్ పుష్పలత, సర్పంచ్ రాధ, జెడ్పీటీసీ గంగాదేవి పాల్గొన్నారు.

రైల్వే రిజర్వేషన్ వేళల్లో మార్పు

హిందూపురం అర్బన్ : సౌత్ వెస్టర్న్ రైల్వే పరిధిలోని హిందూపురం రైల్వేస్టేషన్‌లో బుధవారం నుంచి రిజర్వేషన్ వేళలు మార్చారు. ఈ మేరకు రైల్వే బుకింగ్ ఆఫీసర్ ఆనంద్ బుధవారం తెలిపారు. ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు నిరవధికంగా బుకింగ్ కేంద్రం పనిచేస్తుందన్నారు. ఆ సమయంలో ఎప్పుడైనా రిజర్వేషన్, ఇతర టికెట్లు పొందవచ్చునన్నారు. రైల్వే ప్రయాణికుల సౌకర్యార్థం మూడు నెలల పాటు ఈ వేళలు అందుబాటులో ఉంటాయన్నారు.

4న ప్రెస్ అకాడమీ చైర్మన్ రాక

పుట్టపర్తి అర్బన్: ఈ నెల 4న పుట్టపర్తికి రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు (కేఎస్ఆర్) రానున్నారు. ఈ మేరకు కలెక్టర్ అరుణ్‌బాబు, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఆవుటాల రమణారెడ్డి తెలిపారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. 3వ తేదీ రాత్రికి ప్రశాంతి నిలయానికి కేఎస్ఆర్ చేరుకుంటారన్నారు. 4న 'వ్యవసాయ రంగం–సంస్కరణలు' అంశంపై కలెక్టరేట్‌లో నిర్వహించే సదస్సులో పాల్గొంటారని వివరించారు.

తల్లి పాలే శిశువుకు అమృతం



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పుట్టపర్తి అర్బన్: తల్లి పాలు ఎంతో శ్రేష్టమైనవని, శిశువు మానసిక, శారీరక ఎదుగుదలకు తల్లిపాలు అమృతంతో సమానంగా పనిచేస్తుందని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ కృష్ణయ్య పేర్కొన్నారు. తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకుని పుట్టపర్తి మండలం నిడిమామిడి, జగరాజుపల్లిలో బుధవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ర్యాలీ చేపట్టి, గర్భిణులు, చిన్నారులకు అందించే పౌష్టికాహారం, వ్యాధి నిరోధక టీకాలు, రక్తహీనత నివారణ, తల్లి పాల విశిష్టతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ నగేష్, సూపర్‌వైజర్లు వెంకటరమణ, చంద్రకళ, ఎంఎల్‌హెచ్‌పీ అపర్ణ, సుస్మిత తదితరులు పాల్గొన్నారు.

కళ్లకలకతో ఆందోళన వద్దు

కళ్లకలకతో ఆందోళన చెందాల్సిన పని లేదని, జిల్లా అంధత్వ నివారణ సంస్థ కంటి వైద్య నిపుణురాలు డాక్టర్ అనురాధ పేర్కొన్నారు. బుధవారం ఆమె మాట్లాడుతూ. గాలి, నీరు, చేతుల ద్వారా వ్యాపించే కళ్లకలకతో కళ్లు ఎర్ర బారడం, నీళ్లు కారడం, పుసి కట్టడం, కనురెప్పలు ఉబ్బి ఉండడం, నొప్పి, దురద, మంటలు ఉంటాయన్నారు. సరైన జాగ్రత్తలు తీసుకుంటే త్వరగా నయమవుతుందన్నారు. తరచూ కళ్లను చల్లని నీటితో కడగాలన్నారు. నల్లకంటి అద్దాలు ధరించడం, ఉతికిన రుమాలును ఉపయోగించడం, సమీపంలోని కంటి వైద్యులను సంప్రదించి యాంటీబయాటిక్ కంటి చుక్కల మందును వాడడం ద్వారా కళ్లకలకను నివారించవచ్చునన్నారు.

ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

- జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ



పదోన్నతుల ఉత్తర్వులు అందుకున్న ఉద్యోగులతో గిరిజమ్మ, జెడ్పీ సీఈఓ భాస్కర్‌రెడ్డి

అనంతపురం సిటీ: ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతినిస్తోందని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గిరిజమ్మ అన్నారు. జిల్లా పరిషత్ పరిధిలోని పంచాయతీరాజ్, పీఐయూ, ఆర్‌డబ్ల్యూఎస్, ఉన్నత పాఠశాలల్లో పని చేస్తున్న తొమ్మిది మంది జూనియర్ అసిస్టెంట్లకు సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పిస్తూ సీఈఓ భాస్కర్‌రెడ్డితో కలసి బుధవారం ఆమె ఉత్తర్వులు అందజేసి, మాట్లాడారు. పాతికేళ్లుగా ఉద్యోగుల పదోన్నతులను గత ప్రభుత్వాలు పట్టించుకోలేదన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన నాలుగేళ్లలోనే దశల వారీగా అందరికీ పదోన్నతులు కల్పించడం గర్వంగా ఉందన్నారు. అనంతరం పదోన్నతులు పొందిన ఉద్యోగులు గిరిజమ్మను సత్కరించారు.

సీనియర్ రెసిడెంట్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం క్రైం: సీనియర్ రెసిడెంట్ స్పెషలిస్టు వైద్యుల నియామకానికి అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఈ మేరకు అనంతపురం వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీదేవి బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. దరఖాస్తులను అనంతపురం వెబ్‌సైట్ www.ananthapuramu.ap.gov.inలో అందుబాటులో ఉంచారు. వీటిని అర్హులైన వైద్యులు డౌన్‌లోడు చేసుకుని, భర్తీ చేసి ఈ నెల 5న సాయంత్రం 5 గంటల్లోపు వైద్య కళాశాలలో అందజేయాలి. ఈ నెల 7న వాకిన్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. అభ్యర్థులు ఇంటర్వ్యూ రోజున ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు మూడు సెట్ల జిరాక్స్ ప్రతులను తీసుకెళ్లాలి.

ఏపీఎల్‌కు 14 మంది ఎంపిక

- అత్యధిక ధర పలికిన గిరినాథరెడ్డి
- రూ.6.1 లక్షలతో కొనుగోలు చేసిన రాయలసీమ కింగ్స్
- రూ.4.8 లక్షలతో రెండో స్థానంలో డీబీ ప్రశాంత్



గిరినాథరెడ్డి



డీబీ ప్రశాంత్‌కుమార్

అనంతపురం: విశాఖపట్నం వేదికగా ఈ నెల 16 నుంచి 27వ తేదీ వరకూ ఆంధ్రా ప్రీమియర్ లీగ్–2 (ఏపీఎల్)కు అనంతకు చెందిన 14 మంది క్రీడాకారులు ఎంపికయ్యారు. ఇందుకు సంబంధించి క్రీడాకారుల వేలం ప్రక్రియ బుధవారం వైజాగ్ నిర్వహించారు. రాష్ట్రంలోనే అత్యధిక క్రీడాకారుల ఎంపికైన జాబితాలో తొలుత విశాఖ ఉండగా, రెండో స్థానం అనంతకు దక్కింది. ఇందులో 12 మంది ఆర్డీటీలో శిక్షణ పొందిన వారే కావడం గమనార్హం. ఏపీఎల్‌లో చోటు దక్కించుకున్న క్రీడాకారులను ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛూ ఫెర్రర్ అభినందించారు.

ఏపీఎల్‌కు ఎంపికైన క్రీడాకారులు వీరే..

క్రీడాకారుడు	జట్టు	వేలంలో పాడిన మొత్తం
పి.గిరినాథరెడ్డి	రాయలసీమకింగ్స్ (కెప్టెన్)	రూ.6.1 లక్షలు
డీబీ ప్రశాంత్‌కుమార్	వైజాగ్ వారియర్స్	రూ.4.8 లక్షలు
సోయబ్‌మహమ్మద్ ఖాన్	బెజవాడ టైగర్స్	రూ.3.6 లక్షలు
ఎం.రాజకుళ్లాయప్ప	రాయలసీమ కింగ్స్	రూ.3.1 లక్షలు
బి.సంతోష్‌కుమార్	బెజవాడ టైగర్స్	రూ.1 లక్ష
ఎంకే దత్తారెడ్డి	కోస్టల్ రైడర్స్	రూ.1 లక్ష
జి.మల్లికార్జున	గోదావరి టైటాన్స్	రూ.1 లక్ష
జి.దీపక్	కోస్టల్ రైడర్స్	రూ.1 లక్ష
పి.అర్జున్‌టెండూల్కర్	వైజాగ్ వారియర్స్	రూ.1 లక్ష
బి.వినయ్‌కుమార్	రాయలసీమ కింగ్స్	రూ.50 వేలు
జి.సంపత్‌కుమార్	రాయలసీమ కింగ్స్	రూ.50 వేలు
ఎస్.కమిల్	గోదావరి టైటాన్స్	రూ.25 వేలు
కేహెచ్ వీరారెడ్డి	రాయలసీమ కింగ్స్	రూ.25 వేలు
చైత్ర వర్ధన్	రాయలసీమ కింగ్స్	రూ. 25 వేలు

ఉచిత కంప్యూటర్ శిక్షణ

అనంతపురం సిటీ: ముస్లిం మైనారిటీ విద్యార్థులకు రాష్ట్ర ఉర్దూ అకాడమీ, స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో కంప్యూటర్ శిక్షణ (డొమెస్టిక్ డేటాఎంట్రీ ఆపరేటర్) ఇవ్వనున్నట్లు మైనారిటీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి షేక్ మహమ్మద్ రఫీ బుధవారం తెలిపారు. పదో తరగతి పాసై 40 ఏళ్లలోపు వయస్సు కలిగిన వారు మైనారిటీ సహా ఇతర కులాల వారు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఈనెల 17వ తేదీలోగా అనంతపురంలోని ఉర్దూ అకాడమీ శిక్షణ క్షేత్రం, సైఫుల్లా కాంప్లెక్స్, పాత ఊరు, అనంతపురం చిరునామాకు దరఖాస్తులు పంపవచ్చన్నారు. 8328028731, 73964 20266 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ముగ్గురిపై కేసు నమోదు

గుత్తి రూరల్: వ్యక్తి మృతికి కారణమైన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. వివరాలు.. గుత్తి మండలం తురకపల్లిలో మంగళవారం బీడీ కట్ట అప్పుగా అడిగిన చిరంజీవిని కిరాణా దుకాణం యజమాని రవి, ఆయన తండ్రి మస్తాన్, కుమారుడు సాయికుమార్ తోసేశారు. దీంతో మెట్లపై పడి గాయపడిన చిరంజీవి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. చిరంజీవి తండ్రి మాణిక్యం ఫిర్యాదు మేరకు రవి, మస్తాన్, సాయికుమార్‌పై కేసు నమోదు చేశారు.

ఖాజీల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా జాహిద్

అనంతపురం సిటీ: ఏపీ ప్రభుత్వ ఖాజీల అసోసియేషన్ అనంతపురం జిల్లా అధ్యక్షుడిగా ఖాజీ జాహిద్‌హుస్సేన్ ఎంపికయ్యారు. తిరుపతిలోని మస్జిద్ అబుబకర్ షాదీఖానాలో ప్రభుత్వ ఖాజీల రాష్ట్ర స్థాయి సమ్మేళనం బుధవారం నిర్వహించారు. 26 జిల్లాలకు కమిటీలను ఏర్పాటు చేశారు. రాష్ట్ర అధ్యక్షుడిగా తిరుపతి హాజీ సయ్యద్ షఫీ హాజరి నియమితులయ్యారు.

మేర పంటలతో చీడపీడల నివారణ

- ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త రామసుబ్బయ్య

తాడిమర్రి: వేరుశనగలో మేర పంటలు, ఎర పంటలను సాగు చేయడంతో చీడ, పీడలు నివారణ సాధ్యమని పుట్టపర్తి ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త రామసుబ్బయ్య రైతులకు సూచించారు. మండలంలోని ఎం.అగ్రహారం గ్రామంలో బుధవారం మండల వ్యవసాయ అధికారిణి రమాదేవి నిర్వహించిన పొలంబడి కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేరుశనగ సాగులో మేర పంటలుగా జొన్న, సజ్జ, ఎర పంటలుగా ఆముదం, బంతి పంటలను సాగు చేసుకోవాలన్నారు. దీంతో పంటను ఆశించే రసం పీల్చే పురుగులు, వేరు పురుగు, మొవ్వకుళ్లు నుంచి పంటలను కాపాడు కోవచ్చునన్నారు. విత్తన శుద్ధి పాటిస్తే మొదటి 30 రోజులు ఎలాంటి చీడ, పీడలు వ్యాపించవన్నారు. అనంతరం ఆయన తాడిమర్రి, ఎం.అగ్రహారం గ్రామాల్లో నీటి పారుదల కింద సాగు చేసిన పంట పొలాలను సందర్శించి రైతులకు సూచనలు, సలహాలు అందించారు. వేరుశనగ పంటలకు అవసరానికి మించి నీటి తడులు ఇస్తే పంటలకు తెగుళ్లు అధికంగా వ్యాపిస్తాయని తెలిపారు. పంటలకు పురుగులు కాని తెగుళ్లు వ్యాపిస్తే రసాయన పురుగు మందులు పిచికారి చేయకుండా వ్యవసాయ అధికారుల సూచనల మేరకు మందులు పిచికారి చేసుకోవాలని ఆయన రైతులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా రీసోర్స్ సెంటర్ శాస్త్రవేత్త రవికిషోర్, పుట్టపర్తి, ధర్మవరం ఏడీఏలు విద్యావతి, కృష్ణయ్య, రైతు భరోసా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

రైతు సంతృప్తి చెందేలా పరిహారం

- తహసీల్దార్ రంగనాయకులు

గోరంట్ల: జిల్లాలో జాతీయ రహదారుల నిర్మాణంలో భాగంగా భూములు కోల్పోతున్న రైతులు సంతృప్తి చెందేలా పరిహారాన్ని ప్రభుత్వం అందజేస్తోందని గోరంట్ల తహసీల్దార్ రంగనాయకులు అన్నారు. వైఎస్సార్‌జిల్లా నుంచి కోడూరు వరకు మంజూరైన ఎన్‌హెచ్ 342, హిందూపురం వరకూ మంజూరైన ఎన్‌హెచ్ 716 రహదారుల నిర్మాణానికి సంబంధించి భూములు కోల్పోతున్న రైతులతో బుధవారం గ్రామ సభలు నిర్వహించారు. తొలుత పాలసముద్రం గ్రామ పంచాయతీ కార్యాలయంలో 716వ జాతీయ రహదారి రెండో విడతకు సంబంధించి సర్పంచ్ చిన్న గంగప్ప అధ్యక్షతన నిర్వహించిన గ్రామ సభలో తహసీల్దార్ మాట్లాడుతూ... పాలసముద్రం, కాటేపల్లి రెవెన్యూ పరిధిలో సేకరిస్తున్న భూముల వివరాలను వెల్లడించారు. 2013 భూసేకరణ చట్టం మేరకు పాలసముద్రం రెవెన్యూ పరిధిలో ఎకరాకు రూ.41.24 లక్షలు, కాటేపల్లి రెవెన్యూ పరిధిలో ఎకరాకు రూ.21.90 లక్షలు చెల్లించే అవకాశముందన్నారు. దీనిపై రైతులు అభ్యంతరం తెలుపుతూ మార్కెట్ ధర ప్రస్తుతం ఎకరాకు రూ.కోటికి పైగా నడుస్తోందని, తమకు మరింత సాయం అందించాలని కోరారు. ఈ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని తహసీల్దార్ హామీనిచ్చారు. అనంతరం గోరంట్ల మూడో సచివాలయంలో సర్పంచ్, సరోజబాయి, మల్లాపల్లి సర్పంచ్ శివనంద ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామసభల్లో తహసీల్దార్ మాట్లాడారు. గోరంట్ల రెవెన్యూ పరిధిలో ఎకరాకు రూ.27.82 లక్షలు, మల్లాపల్లి రెవెన్యూ పరిధిలో రూ.14.09 లక్షల పరిహారం అందే అవకాశముందన్నారు. రైతులు సహకరిస్తే త్వరలో భూసేకరణ చేపట్టి పరిహారాన్ని ఆయా రైతుల ఖాతాల్లోకి జమ అయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు.

పింగళి వెంకయ్య సేవలు అమూల్యం



నివాళులర్పిస్తున్న గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఎల్ఎం ఉమ

అనంతపురం: జాతీయ పతాక రూపకర్త, స్వాతంత్ర్య సమరయోధుడు పింగళి వెంకయ్య సేవలు అమూల్యమని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఎల్ఎం ఉమామోహన్ రెడ్డి అన్నారు. త్రివర్ణ పతాకం అందరి గుండెల్లో చిరస్థాయిగా ఉండడానికి ఆయన చేసిన కృషి ప్రశంసనీయమన్నారు. భావి తరాల అభ్యున్నతికి పాటుపడిన మహనీయులను స్మరించుకోవడం మన బాధ్యత అని పేర్కొన్నారు. గ్రంథాలయంలో పింగళి వెంకయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఎల్ఎం మోహన్ రెడ్డి, మాజీ అధ్యక్షురాలు వి.సుబ్బరత్నమ్మ, ఉప గ్రంథాలయాధికారి ఇంతియాజ్ అహమ్మద్, జీఎం బాషా తదితరులు పాల్గొన్నారు.

పానీపూరి వ్యాపారిపై దాడి

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: అనంతపురంలోని పాతూరులో పానీపూరి అమ్ముకుని జీవనం సాగిస్తున్న తనను నందకిషోర్ అనే వ్యక్తి ఇబ్బంది పెడుతున్నాడంటూ ఖలీబ్‌సాబ్ బుధవారం వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. నందకిషోర్ తప్పతాగి పలుమార్లు దాడి చేశాడని తెలిపాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రెడ్డెప్ప తెలిపారు.